# శ్రీ రేబాల దశరథరామి రెడ్డి

శ్రీ రేబాల దశరథరామి రెడ్డి అయిదవ శాసనసభ (1972-1978) స్పీకరుగా 1975వ సంవత్సరం జనవరి 28వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1978వ సంవత్సరము మార్చి 14వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

వీరి హయాంలో 1976-77 సంవత్సరంలో మొదటి సారిగా అనుసూచిత వర్ణముల సంక్షేమ కమిటి, అనుసూచిత జాతుల సంక్షేమ కమిటి, వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటి, లైబ్రరీ కమిటీలను ఏర్పాటు చేశారు.

వీరు 1907వ సంవత్సరము నవంబరు 30వ తేదీన నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు.

మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.ఏ. డిగ్రీని, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచిఎల్.ఎల్.బి. డిగ్రీని పొంది కొంత కాలం పాటు అడ్వకేటుగా ప్రాక్టీసు చేశారు. 1947-1951 సంవత్సరాల మధ్య కాలంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 1940వ సంవత్సరంలో సత్యాగ్రహంలో పాల్గొన్నందుకుగాను జైలు శిక్ష అనుభవించారు.

శ్రీ దశరథరామి రెడ్డి అనేక పదవులను నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు రవాణా అథారిటీలో అనధికార సభ్యునిగా అయిదు సంవత్సరాలు పనిచేశారు. ఆల్ ఇండియా కో-ఆపరేటివ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిటీ ఉపాధ్యక్షులుగా, మద్రాసు స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా, ఆంధ్ర స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా, కోస్టల్ ఆంధ్ర ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులుగా పనిచేశారు.

శ్రీ దశరథరామి రెడ్డి 1960 సంవత్సరములో (ఉప ఎన్నిక) మొదటిసారిగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ రెండవ శాసనసభకు ఎన్నికైనారు. తిరిగి 1962వ సంవత్సరము మూడవ శాసనసభకు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం

నుండి, 1972వ సంవత్సరము ఐదవ శాసనసభకు అల్లూరు నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. వీరు 1967-1970 సంవత్సరాల మధ్య కాలంలో కావలి నియోజకవర్గం నుండి లోక్‌సభ సభ్యునిగా ఉన్నారు.

స్పీకరుగా శ్రీ దశరథరామి రెడ్డి సమర్థవంతంగా పనిచేశారు. సభాసమక్షంలో పత్రాలను ఉంచేవారు ఆ పత్రాలను ఏ నిబంధన క్రింద, నియమావళి క్రింద, ఉపనియమావళి క్రింద ఉంచుతున్నారో ధృవీకరించవలసి ఉంటుందని శ్రీ దశరథరామ రెడ్డి 1975, ఫిబ్రవరి 22వ తేదీన ఇచ్చిన రూలింగులో స్పష్టం చేశారు.

శ్రీ రేబాల దశరథరామి రెడ్డి 2005వ సంవత్సరం జూన్ 9వ తేదీన మరణించారు.

## శ్రీ దశరథరామి రెడ్డి స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

సభానాయకులు ముఖ్యమంత్రిగారు, వివిధ పార్టీ నాయకులు, గౌరవ సభ్యులు యీ శాసనసభ అధ్యక్ష పదవికి సంపూర్ణ హృదయంతో నన్ను ఎన్నుకొన్నందుకు మీ అందరికీ నా హృదయపూర్వక అభివందనాలు తెలియ పరుస్తున్నాను. ముఖ్యంగా, గూడూరు నుండి, ఏలూరునుండి ఎన్నికైన సభ్యులు యీ పోటి నుండి విరమించుకొని ఏకగ్రీవంగా ఎన్నిక జరిపినందుకు వారికికూడ ప్రత్యేకంగా నా హృదయపూర్వక వందనములు. మీరందరు రెండుమూడు గంటలనుండి ఎన్నో సలహాలు సూచనలు చేసినారు. ముఖ్యంగా నాపట్ల వ్యక్తిగతంగా అనేకమైన మంచి మాటలు చెప్పినారు. సభానాయకులు, ప్రతిపక్ష నాయకులు, సభ్యులు నాపట్ల గౌరవసూచకంగా ప్రేమ పూర్వకంగా చెప్పిన మాటలకు నా నమస్కారములు తెలియజేస్తున్నాను. శాసనసభా వ్యవహారములలో నా విద్యుక్తధర్మం నెరవేర్చటంలో నిష్పక్షపాతంగా ప్రవర్తించగలనని సవినయంగా మీకు మనవిచేస్తున్నాను. శాసనసభ్యులలో అన్ని పక్షముల వారి వాదనను సమదృష్టితో పరిశీలించి నా బాధ్యత సర్వజనామోదకంగా నిర్వహించటంలో మీ పూర్తి సహకారం నాకు లభించగలదని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను. ఈ సభ యొక్క ప్రాభవ వైభవములను, గౌరవ మర్యాదలను కాపాడుటకు మునుపటి అధ్యక్షులు చూపిన శ్రద్ధాసక్తులు, సభ్యులు చూపిన సహకారము శ్లాఘనీయమైనది. ఇకముందు కూడ సభా గౌరవ మర్యాదలను పరిరక్షించటములో నా శక్తివంచన లేకుండా కృషిచేయగలనని వాగ్దానం చేస్తున్నాను. మీ ప్రేమాభిమానములతో, సహకారముతో నా మాట నిలబెట్టుకో గలనని దృఢంగా నమ్ముతున్నాను. ఈనాడు మన రూల్సు గురించి ప్రస్తావించినారు. ఈ రూల్సు మన సభవారు ఏర్పాటు చేసుకొన్నటువంటివే. ఈ సభా కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించటానికి మనం ఏర్పాటు చేసుకొన్నటువంటివి. వాటిలో ఏవైనా లోటుపాట్లు ఉంటే యీ సభయొక్క హుందాతనానికి, గౌరవానికి, యీ సభలో జరిగే చర్చలు సక్రమంగా నిర్వహించటానికి అవి అంత తోడ్పడక పోతే అవి తప్పకుండా మార్చుకొనే హక్కు మనకు ఉంది. ప్రతిపక్షం వారుగాని, ప్రభుత్వపక్షం వారుగాని అటువంటి విషయాలు నా దృష్టికి తీసుకువచ్చినపుడు మనమందరం వాటిని గురించి మాట్లాడుకొని వాటిని

తప్పకుండా మార్చుకోటానికి అవకాశం ఉంది. ఆ విధంగా మార్పు చేసుకొంటామని చెబుతున్నాను. ఈనాడు గౌరవ సభ్యులు కొంత మంది ఇక్కడకు వచ్చినపుడు వారి వెహికిల్స్ రాకుండా అడ్డు పెట్టారని, అందువల్ల వారి గౌరవానికి ఆటంకం కలిగిందని చెప్పినారు. అటువంటిది జరగకుండా ఇకమీదట కృషి చేస్తానని చెబుతున్నాను. కృషిచేయటమేకాదు, తప్పకుండా దానిని అమలు జరుపుతానని చెబుతున్నాను. అందుకు ముఖ్యమంత్రిగారు, అందరూ తప్పకుండా సహకరిస్తారని నేను విశ్వసిస్తున్నాను. రంగారెడ్డిగారు ఇంతకు ముందు మూడు సంవత్సరాలుగా ఇక్కడ స్పీకరుగా ఉంటూ వచ్చినారు. వారు సత్ సాంప్రదాయాన్ని అంతకుముందు ఉన్న దానిని నిలబెట్టటమే కాకుండా, వారు దానిని ఇంకా హుందాతనంగా చేసి, హెచ్చు స్థాయిలో యీ సభయొక్క కార్యక్రమాలు నిర్వహించినందుకు వారిని అభినందిస్తున్నాను. నేను చెప్పవలసిన అనేక విషయాలు వారే తెలియచేసినారు. ఈనాడు వారు చెప్పిన విషయాలు వారు స్పీకర్ అయిననాడు కొంత చర్చకు వచ్చింది. వారు అప్పుడు మాట్లాడినపుడు కూడ యీ స్పీకర్ పని ఏ రకంగా ఉండవలెను, ఒక పార్టీలో ఉండవలెనా, ఒక పార్టీలో ఎన్నికైన తర్వాత ఆ పార్టీనుండి విరమించుకోవలెనా యీ విషయాలన్నీ ఇంతకు ముందే వారు చెప్పినారు. ఈనాడు యీ దేశంలో ఉన్న పరిస్థితులను బట్టి అవి అమలు జరపటానికి వీలున్నదా లేదా అమలు జరిపినట్లయితే సక్రమంగా కార్యక్రమాలు నిర్వహించటానికి వీలువుతుందని వారు అభిప్రాయం చెప్పారు. వారు తెల్పిన అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. ముఖ్యంగా యీ సభ కార్యక్రమాన్ని జరపటానికి మీ అందరి యొక్క సహకారం పూర్తిగా లేనట్లయితే నేను ఏదీ కూడ నిర్వహించటానికి వీలుండదు. తప్పకుండా మీ సహకారం ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. అందుకు కావలసిన నేర్పు, ఓర్పు ఔదార్యము మనందరికి భగవంతుడు ప్రసాదించుగాక అని ప్రార్థిస్తూ యీ బాధ్యతాయుతమైన ఉన్నత పదవిని నాకు అప్పగించినందుకు మరొకసారి మీకు హృదయ పూర్వక వందనములు తెలియజేస్తున్నాను. జైహింద్